# నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 29 జూలై 2024 | NALGONDA


## బీఆర్ఏఓయూలో యూజీ, పీజీ అడ్మిషన్లకు ఆహ్వానం

- ఆగస్టు 18వరకు గడువు

రామగిరి, జూలై 28 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ, డిప్లొమో కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ రీజినల్ కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ఆగస్టు 18వరకు చివరి అవకాశం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో అర్హులైన అభ్యర్థులు www.braouonline.in లేదా www.braou.ac.inలో లాగిన్ అయితే పూర్తి సమాచారం ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నల్లగొండ ఎన్జీ కళాశాల, ఉమెన్స్ కళాశాల, దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడ కేఎన్ఎం డిగ్రీ కళాశాల, కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో యూజీ స్టడీ సెంటర్స్ ఉన్నాయని, పీజీ కోర్సులకు నల్లగొండ ఎన్జీ కళాశాలలో మాత్రమే ఉందని పేర్కొన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజులను ఇదే గడువులోగా చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9533101295, 7989339180 నంబర్లలోగానీ, నల్లగొండ ఎన్జీ కళాశాల ఆవరణలోని బీఆర్ఏఓయూ రీజినల్ కోఆర్డినేషన్ సెంటర్‌లోగానీ సంప్రదించాలని పేర్కొన్నారు.

## బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 28 : భువనగిరి మండలం అనంతారంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల)లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈ.హేమలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ (ఈపీహెచ్), బీకామ్(సీఏ), బీకామ్ (బీఏ), బీఎస్సీ (బీజెడ్‌సీ, బీజెడ్‌జీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంపీజీ) విభాగాల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 31వరకు గడువు ఉందని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో ఉచిత హాస్టల్ సౌకర్యంతోపాటు నాణ్యమైన విద్యాబోధన, అన్ని రకాల పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9948984800, 9652434051 నంబర్లను సప్రదించాలని తెలిపారు.



పురస్కారాలు అందుకున్న డ్రైవర్స్, కండక్టర్స్, మెకానిక్స్‌తో ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు

- అందజేసిన ఈడీ పురుషోత్తంనాయక్

నల్లగొండ సిటీ, జూలై 28 : ఉత్తమ పనితీరుతోనే వ్యక్తి ప్రతిభ బయటకు వస్తుందని, దానికి తార్కాణమే పురస్కారాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తంనాయక్ అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రతిభ చూపిన డ్రైవర్స్, కండక్టర్స్‌తోపాటు డిపోల్లోని మెకానిక్స్ నల్లగొండ రీజియన్ పరిధిలో ప్రతి త్రైమాసికంలో పురస్కారాలను అందజేస్తున్నారు. నల్లగొండ రీజియన్ ట్రైనింగ్ హాల్‌లో ఆదివారం జరిగిన ప్రదానోత్సవానికి ఈడీ పురుషోత్తంనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ బాధ్యత అన్నారు. ఆర్టీసీ సేవలో నల్లగొండ రీజియన్ తెలంగాణలోనే ముందు ఉందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్ఎం ఎం.రాజశేఖర్, అన్ని డిపోల మేనేజర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతు వేదికలకు నిర్వహణ నిధుల్లేవ్

బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా రూ.9 వేలు విడుదల

ప్రస్తుతం ఖర్చులు భరించలేకపోతున్న వ్యవసాయ అధికారులు

## పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం





నేరేడుచర్ల, జూలై 28 : వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించింది. అన్నదాతలను సంఘటితం చేయడం, వారికి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి తెలియజేయడం, నూతన సాగు విధానాలు, వ్యవసాయంలో సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రతిష్టాత్మకంగా రైతు వేదికలను నిర్మించింది. వాటిల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రైతులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం కూడా వాటిలోనే సమావేశాలు నిర్వహిస్తున్నది. కానీ ప్రతి నెలా వాటి నిర్వహణకు ఇచ్చే రూ.9వేలు మాత్రం విడుదల చేయడం లేదు.

సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు ఉండగా ప్రతి మండలంలో 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఈ విధంగా జిల్లాలో 82 క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌లో రూ. 22లక్షలు వెచ్చించి రైతు వేదిక భవనాలను సర్వాంగ సుందరంగా చేపట్టి అందుబాటులోకి తెచ్చింది. అందులోనే వ్యవసాయాధికారులు రైతులకు సాగు సమయంలో సలహాలు, సూచలను ఇచ్చేలా ఏర్పాట్లు చేసింది. ఒక్కో రైతు వేదిక నిర్వహణ కోసం గత ప్రభుత్వం తొలుత ప్రతి నెలా రూ.3వేలు మాత్రమే ఇచ్చినప్పటికీ నిర్వహణ భారంగా మారుతుందని గుర్తించి ఆ తర్వాత దానిని రూ. 9వేలకు పెంచింది. వాటిని రైతు వేదిక పేరు మీద బ్యాంకు ఖాతా తెరిచి ప్రతినెలా నేరుగా అందులో డబ్బులు జమ చేసింది. ఆ నిధులను విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపు, క్లీనింగ్, శానిటేషన్, ఫర్నిచర్ వంటి ఖర్చులకు ఉపయోగించుకునేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు వేదికల నిర్వహణను గాలికి వదిలేసింది. ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణ, వాచ్‌మెన్ వేతనాలు చెల్లించకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఒక్కో రైతు వేదికకు నెలకు అయ్యే ఖర్చు**

| అంశం | రూపాయలు |
|---|---|
| విద్యుత్ చార్జీలు | 1,000 |
| తాగునీటికి | 500 |
| ఊడ్చేవారికి వేతనం | 3,000 |
| స్టేషనరీ, జీరాక్స్ | 1,000 |
| రైతు శిక్షణ శిబిరాలు, శానిటరీ, మిని లైబ్రరీ | 2,500 |
| మరమ్మతులు, తదితరాలు | 1,000 |

### రైతు సేవలో వేదికలు

రైతు వేదికలు అన్నదాలకు ఎంతో సేవ చేస్తున్నాయి. ఎరువులు, విత్తనాల సమాచారం, సాగులో పాటించాల్సిన పద్ధతులు, నూతన విధానాలపై రైతు వేదికల నుంచే రైతులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. అవగాహన సదస్సుల కోసం వచ్చిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కుర్చీలు, మిషన్ భగీరథ నీరు, మైకులు గత ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. కానీ సంవత్సర కాలంగా నిధులు విడుదల కాక రైతు వేదికల నిర్వహణ భారంగా మారుతున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని పలువురు వ్యవసాయాధికారులు కోరుతున్నారు.



నాగార్జున సాగర్ డ్యామ్

## శ్రీశైలానికి 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- త్వరలో సాగర్ చెంతకు కృష్ణమ్మ

నందికొండ, జూలై 28 : కృష్ణానది పరువళ్లు తొక్కుతుండడంతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. ఆల్మట్టి, జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులకు గానూ ప్రస్తుతం 873.40 అడుగులకు చేరింది. శ్రీశైలం రిజర్వాయర్‌లో ఇంకా 59 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్నా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో భారీ స్థాయిలో ఉన్నందున త్వరలో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లో కొనసాగితే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు మంగళవారంలోపు శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు నాగార్జునసాగర్ ఎన్నెస్పీ అధికారులు భావిస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గానూ ప్రస్తుతం 510.10 (131.83 టీఎంసీలు) అడుగుల వద్ద నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాల ద్వారా 5,3677 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు నీళ్లు వచ్చే అవకాశం ఉండడంతో ఆయకట్టు కింద సాగు చేసే రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# సర్కారు హాస్టళ్ల మూత..!

## ఈ విద్యా సంవత్సరంలో మూడు వసతి గృహాలు బంద్

- గుండాల, తుర్కపల్లి, మోత్కూరు బీసీ-బీ హాస్టళ్లు..
- తక్కువ విద్యార్థులున్న చోట మరికొన్ని మూసేందుకు ప్లాన్..!
- 'వసతి' సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- హాస్టళ్లలో కనీస సదుపాయాల కల్పనలో విఫలం
- ఆసక్తి చూపని తల్లిదండ్రులు, విద్యార్థులు
- ఇటీవల వరుస ఫుడ్ పాయిజన్‌లు, ఆత్మహత్యలతో వెనుకడుగు

యాదాద్రి భువనగిరి, జూలై 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ శాఖలను గాలి కొదిలేసింది. సంక్షేమ శాఖ పరిధిలో ఉండే వసతి గృహాలను పట్టించుకోవడమే మానేసింది. ఫలితంగా జిల్లాలో హాస్టళ్లు మూతబడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం మూడు హాస్టళ్లు మూతబడటం సర్కారు అలసత్వానికి నిదర్శనం. మరికొన్ని బంద్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

### ఒకే సారి మూడు బంద్..

- జిల్లాలో 21 ఎస్సీ వసతి గృహాలు, 20 బీసీ, 8 ఎస్టీ హాస్టళ్లు ఉన్నాయి. సుమారు 6,500 మందికి వసతి కల్పించాలి. ఈ విద్యా సంవత్సరంలో ఒకేసారి మూడు హాస్టళ్లను మూసేశారు. వివిధ కారణాలు చూపుతూ బంద్ చేశారు.
- గుండాల మండలంలోని సీతారంపురం గ్రామంలో ఎస్సీ బాలుర హాస్టల్ అడ్మిషన్లు లేక మూతబడింది. గత సంవత్సరం కొందరు విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఈ ఏడాది అడ్మిషన్లు రాలేదు. ఇక్కడ మూతబడిన వసతి గృహాన్ని గుండాల మండల కేంద్రానికి తరలించాలని పలువురు కోరుతున్నారు.
- తుర్కపల్లి మండల పరిధిలో మూడు హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో విద్యార్థులు లేరని మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను బంద్ చేశారు. ఇక్కడ 10మంది విద్యార్థులు అడ్మిషన్ కోసం రాగా, అంత తక్కువ మందితో నడుపలేమని మూసేశారు. నలుగురు విద్యార్థులను తుర్కపల్లి ఎస్టీ హాస్టల్‌కు, మిగతా వారిని భువనగిరి హాస్టల్‌కు తరలించారు.
- మోత్కూరులో రెండు బీసీ-ఏ, బీసీ-బీ రెండు హాస్టళ్లు ఉన్నాయి. గతంలోనే అడ్డగూడూరులో ఉన్న హాస్టల్‌ను మోత్కూరుకు తరలించారు. ఈ విద్యా సంవత్సరం బీసీ-బీలో విద్యార్థులు లేరని బీసీ-ఏలోకి విలీనం చేశారు. దీంతో ఇప్పుడు ఒక్కటే హాస్టల్ మిగిలింది. బీసీ-బీ వసతి గృహాన్ని కాలేజీ హాస్టల్‌గా మార్చాలనే పలువురు కోరుతున్నారు.

### మరికొన్ని మూసివేతకు ప్లాన్..!

జిల్లాలోని హాస్టళ్లలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదు. కొన్ని చోట్ల ఈ ఏడాది ఒక్కరు కూడా చేరలేదని తెలుస్తున్నది. సుమారు 3వేల సీట్లు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. మోత్కూరు, తుర్కపల్లి, ఆత్మకూరు (ఎం) బాలికలు, రామన్నపేట, చౌటుప్పల్‌లోని బీసీ హాస్టళ్లలో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థులు ముందు కు రాలేదు. ఇక విద్యార్థులు తక్కువగా ఉన్న మరికొన్ని హాస్టళ్లు మూసేయడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. మరికొన్ని చోట్ల తక్కువ విద్యార్థులు ఉన్న వసతి గృహాలను దగ్గరలో ఉన్న హాస్టళ్లలో విలీనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వం కొత్తగా గురుకులాలు, హాస్టళ్లు పెంచుకుంటూ పోతే.. కాంగ్రెస్ సర్కారు బంద్ చేసుకుంటూ పోవడం ఏంటని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.





గుండాల మండలంలోని సీతారాంపురంలో మూతబడిన ఎస్సీ బాలుర హాస్టల్

### కారణాలు ఇవీ..

గతంలో హాస్టళ్లలో సీటు కావాలంటే తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. కానీ ప్రస్తుతం సీన్ రివర్సయ్యింది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. సర్కారు హాస్టళ్లలో ప్రధానంగా కనీసం సదుపాయాలు కరువయ్యాయి. అరకొర వసతులతో హాస్టళ్లు నడుస్తున్నాయి. కొన్ని చోట్ల పాత భవనాలు, అద్దె బిల్డింగ్‌లలో కొనసాగుతున్నాయి. ఇక మెనూ, నాణ్యమైన భోజనం అందడంలేదు. స్థానికంగా వార్డెన్లు, ఇన్‌చార్జిలు ఉండటంలేదు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వరుసగా పదుల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ అయిన సంఘటనలు ఉన్నాయి. భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారు. రోజురోజుకు హాస్టళ్లపై తల్లిదండ్రులకు నమ్మకం తగ్గుతున్నది. దాంతో పేరెంట్స్ విద్యార్థులను హాస్టళ్లకు పంపించడం లేదు. దీన్ని సర్కారు సాకుగా చూపిస్తూ ఒక్కొక్కటిగా హాస్టళ్లను బంద్ చేస్తున్నది.

## పుట్టంగండి వద్ద అప్రోచ్ కెనాల్ అడ్డుకట్ట తొలగింపు

- రెండు రోజుల్లో మూడు అడుగులు పెరిగిన సాగర్ నీటిమట్టం



పుట్టంగండి జీరో పాయింట్ వద్ద అప్రోచ్ కెనాల్ అడ్డుకట్ట తొలగింపు పనులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 28 : వేసవిలో జిల్లా, తాగునీటి అవసరాలు తీర్చేందుకు పుట్టంగండి జీరో పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన అత్యవసర మోటర్లను అక్కడి నుంచి తరలించడంతో పాటు అప్రోచ్ కెనాల్‌కు అడ్డుగా వేసిన కట్టను తొలగించారు. సాగర్ నీటి మట్టం 510అడుగులకు తగ్గితే ఏఎమ్మార్పీ మోటర్లు నడుపడం సాధ్యంకాని నేపథ్యంలో గత రెండు నెలలు క్రితం 10 మోటర్లు ఏర్పాటు చేసి రోజుకు 900 క్యూసెక్కుల నీటిని తరలించారు. ప్రస్తుతం శ్రీశైలానికి భారీ వరద నేపథ్యంలో సాగర్‌కు నీటి విడుదల చేసే అవకాశం ఉండడంతో నీటి మట్టం పెరుగక ముందే అత్యవసర మోటర్ల తీసి వేశారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పాదన కోసం 60 వేల క్యూసెక్కులకు పైగా నీరు రావడంతో సాగర్ నీటి మట్టం రెండు రోజుల్లో మూడు అడుగులకుపైగా పెరిగింది. ఆదివారం నాటికి అత్యవసర మోటర్లతో సంబంధం లేకుండా నేరుగా అప్రోచ్ కెనాల్ ద్వారా రెండు మోటర్లతో 800 క్యూస్కెల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ ద్వారా ప్రధాన కాల్వకు వెయ్యి క్యూసెక్కులు నల్లగొండ తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు.

## చెర్వుగట్టులో జాతీయ శైవాగమ సదస్సు ప్రారంభం

నార్కట్‌పల్లి, జూన్ 28: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ సోమేశ్వర, శివ జ్ఞానపీఠం వద్ద జాతీయ శైవాగమ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు సదస్సు కొనసాగనుంది. సదస్సులో ప్రధాన దేవాలయాల ప్రధానార్చకుల అనుభవాలు వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపుగా 150 మంది పండితులు హాజరయ్యారు. శైవాగమ సంప్రదాయ అర్చకులందరికీ ఒక దివ్య సందేశాత్మకంగా, శైవాగమ దివ్య వైభవం దశదిశలుగా వ్యాపించే విధంగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు చెర్వుగట్టు ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ తెలిపారు.



చెర్వుగట్టులో జాతీయ శైవాగమ సదస్సులో పాల్గొన్న అర్చకులు

# అట్టహాసంగా విద్వత్సమ్మేళనం

- రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన జగద్గురువులు, పీఠాధిపతులు, స్వామీజీలు
- రాబోయే శ్రీవిశ్వావసు నామ సంవత్సర పండుగల నిర్ణయం
- పలువురు పండితులు, అర్చకులకు ఘన సత్కారం
- అలరించిన సంగీత విభావరి



యాదగిరిగుట్ట ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యుల దంపతులను సన్మానిస్తున్న విద్వత్సభ ప్రతినిధులు

యాదగిరిగుట్ట, జూలై 28 : యాదగిరిగుట్ట పట్టణంలోని లక్ష్మీనృసింహ వేద విద్యాలయంలో అష్టమ వార్షిక విద్వత్సమ్మేళనం-2024 ఘనంగా జరిగింది. తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ సహకారంతో నిర్వహించిన కార్యక్రమం శనివారం ప్రారంభం కాగా ఆదివారం పరిపూర్ణమైంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి జగద్గురువులు, మహాత్ములు, పీఠాధిపతులు, స్వామీజీలు హాజరయ్యారు. మొదట లక్ష్మీనరసింహ స్వామి వేద విద్యాలయ విద్యార్థులు వేద పారాయణం చేశారు. ఐనవోలు అనంతమల్లయ్య వేదికపై సభా కార్యక్రమం ప్రారంభం కాగా మరుమాముల వేంకటరమణ శర్మ స్వాగతోపన్యాసం చేశారు. జ్యోతి ప్రజ్వాళన అనంతరం సభకు తెలంగాణ విద్వత్సభ అధ్యక్షుడు శ్రీయాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అధ్యక్షత వహించారు. భద్రకాళీ దేవస్థానం ధర్మకర్త శేషు శర్మ, తూండ్ల కమలాకర శర్మ, ధర్మశాస్త్ర విషయాలను ప్రవచించారు. ఈ సభలో కొండకండ్ల రాధా కృష్ణ శర్మ బృందం సంకీర్తన, శ్రీమరుమాముల శశిధర్ శర్మ కుటుంబం సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాండురంగాశ్రమ నిర్వహకులు అప్పాల సత్యనారాయణ శర్మ, ఓరుగంటి మనోహర శర్మ సిద్ధాంతి, హయగ్రీవ గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకుడు, యాదగిరిగుట్ట దేవస్థాన ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో తెలంగాణ విద్వత్సభ సలహాదారులు ఆకెళ్ల జయకృష్ణ సిద్ధాంతి, ఉపాధ్యక్షుడు శ్రీమాన్ కృష్ణమాచార్య సిద్ధాంతి, ప్రధాన కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, సంయుక్త కార్యదర్శి గాడిచర్ల నాగేశ్వర శర్మ సిద్ధాంతి, చికిలి లక్ష్మీ వేంకటేశ్వర శాస్త్రి సిద్ధాంతి, శృంగేరి ఆస్థాన పండితులు, ప్రముఖ పౌరాణికులు బాచంపల్లి సంతోష్ కుమార శాస్త్రి, యాదగిరిగుట్ట దేవస్థాన ఈఓ భాస్కర్‌రావు, చైర్మన్ బి. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవిశ్వావసు నామ సంవత్సరం పండుగలకు ఏకోన్ముఖంగా ఆమోదం

జ్యోతిష్య పండితులు, సిద్ధాంతులతో విద్వద్గోష్టి నిర్వహించారు. రాబోయే శ్రీ విశ్వావసు నామ సంవత్సర(2025) పండుగలను ఆదివారం నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి చంద్రశేఖర్ శర్మ అధ్యక్షత వహించగా విద్వత్సభ సలహాదారులు ఆకెళ్ల జయకృష్ణ శర్మ సిద్ధాంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాఈ సందర్భంగా ప్రతి పండుగ, వ్రతం గురించి క్షుణ్ణంగా చర్చించి నిర్ణయించారు. వీటికి అందరూ ఏకోన్ముఖంగా ఆమోదం తెలిపారు.

### ముఖ్య పండుగలు ఇలా...

రాబోయే శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో(2025) జరుపుకొనే పండుగలు ఇవి. 2025 మార్చి 3న ఉగాది, ఏప్రిల్ 6న శ్రీరామనవమి, ఏప్రిల్ 30న అక్షయ తృతీయ, డోలా గౌరీ వ్రతం, మే 10న స్మార్త నృసింహ జయంతి, శని త్రయోదశి, మే 11న వైష్ణవ నృసింహ జయంతి, అగ్ని కర్తరీ ప్రారంభం, మే 22న హనుమజ్జయంతి, జూలై 6న సర్వేషాం ఏకాదశి(తొలి ఏకాదశి), అగస్టు 8న వరలక్ష్మి వ్రతం, ఆగస్టు 16న కృష్ణాష్టమి, ఆగస్టు 27న వినాయక చతుర్థి, సెప్టెంబర్ 21న మహాలయ అమావాస్య, అక్టోబర్ 22న దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం, అక్టోబర్ 30న దుర్గాష్టమి(బతుకమ్మ పండుగ), నవంబర్ 1న మహార్నవమి, నవంబర్ 2న విజయదశమి, నవంబర్ 19న నరక చతుర్ధశి, నవంబర్ 20న దీపావళి పండుగ, ధనలక్ష్మి పూజ, 21న కేదార వ్రతం, డిసెంబర్ 16న ధనుర్మాస వ్రతారంభం, 2026వ సంవత్సరంలో జనవరి 14న భోగి పండుగ, మకర సంక్రమణం, 15న సంక్రాంతి పండుగ, జనవరి 23న వసంత పంచమి, జనవరి 25న రథ సప్తమి, ఫిబ్రవరి 15న మహా శివరాత్రి, మార్చి 3న హోలి పండుగలను జరుపాలని నిశ్చయించారు.


